రెప్ప వాల్చలేం.. కొనకుండా ఊరుకోం

శిల్పారామంలో కొలువుదీరిన చేనేత వస్త్రాలు
మనసు దోచుకుంటున్న చేనేత క్రాఫ్ట్ మేళా



చేనేత చీరలను పరిశీలిస్తున్న మహిళలు



లేడీస్ డ్రెస్ మెటీరియల్స్

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన అఖిల భారత క్రాఫ్ట్స్ మేళాకు మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల రెండో తేదీన ప్రారంభమైన మేళాలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల చేనేత హస్త కళల ఉత్పత్తిలో పేరుగాంచిన వారు కూడా తాము తయారు చేసిన చేనేత వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిస్తున్నారు. 87 స్టాల్స్ ఏర్పాటు చేయగా మంగళగిరి, వెంకటగిరి జరీ చీరలు, మచిలీపట్నం, ఉప్పాడ, ధర్మవరం, పోచంపల్లి, సిద్ధిపేట కాటన్ చీరలు లభిస్తున్నాయి. గద్వాల్ సిల్క్, కడప నారాయణ్‌పేట్ చేనేత చీరలు, వరంగల్ డర్రీస్, శ్రీకాకుళం కాటన్, ఉత్తర ప్రదేశ్ పురుషుల డ్రస్ మెటీరియల్స్, తంజావూర్ పెయింటింగ్స్ ఇంకా అనేక ప్రాంతాలలో రూపుదిద్దుకున్న హస్తకళల ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిస్తున్నారు. మార్కెట్ ధరలకంటే చౌకగా లభిస్తుండటంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. మహిళలు అత్యంత ప్రీతి పాత్రంగా ధరించే చేనేత వస్త్రాలు, పట్టు చీరలు అందుబాటు ధరలకే లభిస్తున్నాయి. తంజావూర్ పెయింటింగ్స్ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

అందుబాటు ధరల్లో..



రానున్న వేసవి కాలంలో ధరించడానికి సౌకర్యవంతంగా ఉండే చేనేత పురుషులు దుస్తులు అందుబాటు ధరలకే మా స్టాల్‌లో లభిస్తున్నాయి. మార్కెట్‌లో స్టిచింగ్ చార్జీలు అధికంగా ఉంటాయి. స్టిచ్ చేసిన చొక్కాలు, కుర్తాలు అన్ని రంగులలో ఖాదీ వస్త్రాలు విక్రయిస్తున్నాం
–అషూ, ఉత్తరప్రదేశ్ .మెన్ డ్రస్ మెటీరియల్ స్టాల్

నాణ్యమైన నేత చీరలు లభ్యం



పోచంపల్లి చేనేత వస్త్రాలకు ప్రత్యేక స్థానం ఉంది. రూ.2 వేలు నుంచి మొదలుకుని అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడి స్టాల్‌లో తయారీ దారులే విక్రయించడం వలన వినియోగదారులకు తక్కువ ధరకే చీరలు లభిస్తాయి.
–సారయ్య, పోచంపల్లి చీరలు విక్రయ స్టాల్ యజమాని

రూ. 400లు నుంచి రూ.20 వేల వరకూ పెయింటింగ్స్



తమ స్టాల్‌లో దేశంలోనే గుర్తింపు పొందిన తంజావూరు పెయింటింగ్స్ సైజును బట్టి రూ. 400 నుంచి రూ.20 వేలు వరకూ ధరల్లో అందుబాటులో ఉన్నాయి. ఆర్డరుపై రూ. లక్ష ఆపై విలువ గల పెయింటింగ్స్ సరఫరా చేయగలం.
–సెల్వం, తంజావూరు పెయింటింగ్స్ స్టాల్ యజమాని



తంజావూరు పెయింటింగ్స్ స్టాల్

హస్తకళల స్టాల్స్ నిర్వాహకులకు సదుపాయాలు



స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. చేతన వస్త్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపై ఉంది. ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షిస్తున్నాం.
–టి. విశ్వనాథ రెడ్డి, శిల్పారామం ప్రత్యేక అధికారి

రూ.250కే చొక్కాలు



స్టిచింగ్ చార్జీలు అధికంగా ఉన్నాయి. ఓ చొక్కా స్టిచింగ్ చార్జీ రూ. 400లు వరకూ చెల్లించాలి. అంతేకాకుండా క్లాత్‌కు అదనంగా ఖర్చు చేయాలి. ఎలా లేదన్నా షర్ట్‌కు రూ.800 వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడి స్టాల్‌లో రూ.250కే కావలసిన రంగుల్లో కొత్త చొక్కా లభిస్తోంది.
–పి. మోహన్, కొమ్మాది సాయిరామ్ కాలనీ



మంగళగిరి చేనేత వస్త్రాల స్టాల్

క్లుప్తంగా

డ్రైనేజీల శిథిలం



పాత మూలకుద్దులో ప్రధాన రహదారిని ఆనుకుని శిథిలమైన డ్రైనేజీలు

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దులో ప్రధాన రహదారిని ఆనుకుని ఇరువైపులా డ్రైనేజీలు శిథిలమయ్యాయి. దీంతో పూడుకుపోయి మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారాయి. ముఖ్యంగా ప్రధాన డ్రైనేజీకి అనుబంధంగా ఉన్న చిన్న డ్రైనేజీలు కూడా పూడుకుపోయింది. దశాబ్దాల క్రితం నిర్మించిన వీటికి తరువాత మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. ఈ డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు వీటిలో ఉన్న తాగునీటి పైపులను మార్చాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళనం



సాయి హరిణికి బహుమతి అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ మారికవలసలో ఆదివారం శ్రీమాతా ఆరామ ద్రావిడ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 400 బ్రాహ్మణ కుటుంబాలు ఈ కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. వివిధ సంస్కృత, వైదిక కార్యక్రమాలతో పాటు భరతనాట్యం పోటీలు నిర్వహించారు. తగరపువలసకు చెందిన పెంట సాయి హరిణికి బ్రాహ్మణ సంఘం బహుమతి అందించింది. రేజేటి రామకృష్ణ చేసిన సుందరకాండ పారాయణం అందరినీ ఆకట్టుకుంది.

శ్రీవారి సన్నిధిలో సామూహిక పారాయణం



పారాయణం నిర్వహిస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో ఆదివారం ఉదయం ఎండాడకు చెందిన రామలక్ష్మి బృందం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ధనుర్మాస సందర్భంగా తమ సభ్యులచే ఈ పారాయణం నిర్వహించామని తెలిపారు. అదే విధంగా సెలవు రోజు కావడంతో శ్రీవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న బాలభవన్ విద్యార్థుల నృత్యరూపకం



గోదారంగనాథులు, సీతారాముల నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం దేవాలయ ఆవరణలో బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బాలభవన్ విద్యార్థులు గోదాకల్యాణం, రామాయణ నృత్య ప్రదర్శనతో అలరించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య భక్తి మంజరికి చెందిన సరగడ సూకరాజు, రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పక్కన పాలిథిన్ గుట్టలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో పలుచోట్ల రహదారులను ఆనుకుని పాలిథిన్ గుట్టలు కనిపిస్తున్నాయి. తగరపువలస నుంచి పెందుర్తి మార్గంలో వేములవలస వద్ద ఎస్‌బీఐ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమీపంలో ఈ గుట్టలు పేరుకుపోయాయి. అంతేకాకుండా ఈ రహదారిని ఆనుకుని వీధుల ముఖద్వారంలో తుప్పలు, గోతులు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో ఇవి చెరువులను తలపిస్తున్నాయి. అంతేకాకుండా వేములవలస కూడలి నుంచి విశాఖ వైపు వెళ్లే మార్గంలో చేపల మార్కెట్ ఎదురుగా కూడా గలీజు వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అలాగే ఈ కూడలి నుంచి పెందుర్తి మార్గంలో కూడా సుమారు 200 మీటర్ల వరకు రహదారిని ఆనుకుని మాంస వ్యర్థాలు పడేయడడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ ప్రాంతాలలో ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ వాసులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.



వేములవలస ఎస్‌బీఐ పక్కన రహదారిని ఆనుకుని పాలిథిన్ గుట్టలు

వేములవలస మార్కెట్‌కు భారీ గుమ్మడికాయలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూరగాయల మార్కెట్‌కు ఆదివారం భారీ గుమ్మడికాయలు దిగుమతి అయ్యాయి. పయ్యాపల్లి లక్ష్మి అనే కూరగాయల వ్యాపారి వీటిని ఒడిశా నుంచి దిగుమతి చేసుకుంది. తీపి గుమ్మడిగా పిలుచుకునే వీటికి ధనుర్మాసంలో ముఖ్యంగా సంక్రాంతి పండగవేళ అధిక ప్రాధాన్యత ఉంటుంది. సాధారణంగా బెల్లంతో కలిపి పులుసు, కూర చేస్తుంటారు. పూజలో వినియోగించడంతో పాటు కలగూర వంటకంలో దీనిని ఉపయోగిస్తారు. గృహప్రవేశ సమయంలో దిష్టితీయడానికి వినియోగిస్తుంటారు. సాధారంగా గుమ్మడికాయలు 5 కిలోల వరకు ఉంటాయి. ఈమె దిగుమతి చేసుకున్న గుమ్మడి కాయలు మాత్రం ఒక్కొక్కటి 10 నుంచి 20 కిలోలు ఉన్నాయి. వీటిని కాయలుగా కాకుండా ముక్కలుగా కోసి రూ.20 వంతున విక్రయిస్తారు. దీంతో వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది.



వేములవలస మార్కెట్‌కు దిగుమతి అయిన భారీ గుమ్మడికాయలు

మాతృభాషలో ప్రావీణ్యం ఉండాలి

పద్మనాభం: విద్యార్థులు సన్మార్గంలో పయణించేందుకు సుపథ నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు యూవీఏఎన్ రాజు మాస్టారు అన్నారు. పద్మనాభం గోస్తని విద్యా పీఠల్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన సుపథ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యూవీఏఎన్ రాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు మాతృభాషలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలన్నారు. రామాయణం, మహాభారతంపై అభిమానం పెంచుకున్న మంచి నడవడిక అలవర్చుకోవాలని తెలిపారు. పద్య, శ్లోకం, వేదం పఠనాల్లో, శ్రీకృష్ణ చరితామృతం, రామాయణం, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 20 పాఠశాలలకు చెందిన 560 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ మేనేజర్ బి.శేషగిరిరావు, ఆర్మీ రిటైర్డ్ సుబేదర్ కేవీ రమణ రాజు, సుపథ ప్రతినిధులు ఏవీఆర్ఎస్ శర్మ, ఎ.దేముడు, వాసు, వెంకన్న, రాంబాబు, ఎర్రయ్య పాల్గొన్నారు.



సర్టిఫికేట్లతో విద్యార్థులు

గ్రామీణ వైద్యులు జాగ్రత్తలు పాటించాలి

పద్మనాభం: చిన్న పిల్లలకు వైద్యం చేసేటప్పుడు గ్రామీణ వైద్యులు జాగ్రత్తలు పాటించాలని విజయనగరం, విశాఖపట్నం రామచరణ్ ఆస్పత్రి అధినేత, పిడియాట్రిక్ ఫిజీషియన్ ఆర్.అచ్చంనాయుడు సూచించారు. మండలంలోని కృష్ణాపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వైద్య విజ్ఞానంపై గ్రామీణ వైద్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు తక్షణం తడి క్లాత్‌తో ఒళ్లంతా తుడవాలన్నారు. పేరాసిటమల్ మందును వయసు, బరువు బట్టి డోస్ నిర్ణయించి వాడించాలన్నారు. గ్రామీణ వైద్యులు..చిన్న పిల్లలకు మూడు రోజులకు మించి వైద్యం చేయకూదన్నారు. యాంటీబయోటిక్స్ మందులు వాడించకూడదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు రాలి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంవీ రమణ, యు.తాతబాబు, ఎంవీ ప్రసాద్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్చంనాయుడు

8 నుంచి 'అడవివరం' సొసైటీ సభ్యులకు డివిడెండ్

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు సంక్రాంతి కానుకగా ఈ నెల 8 నుంచి 20 వరకు డివిడెండ్‌లు పంపిణీ చేస్తామని సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. సొసైటీ మహాజన సభ ఆదివారం ఒక ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిఫ్ట్ డిపాజిట్ రూ.1.75 కోట్లపై 8 శాతం, షేర్ క్యాపిటల్ రూ.49 లక్షలపై 20 శాతం డివిడెండ్ రూపంలో అందిస్తామన్నారు. సొసైటీ రూ.152 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. రూ.92.92 కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్నట్లు తెలిపారు. సొసైటీ మూడు బ్రాంచిల్లో సూమారు ఆరున్నర కిలోల బంగారు వస్తువులు దీర్ఘకాలికంగా తనఖాలో ఉన్నాయని, వాటిని బహిరంగ వేలం ద్వారా ఆక్షన్ వేస్తామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తీరం... జనసంద్రం

కొమ్మాది: పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి కనిపించింది. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నారులు, పెద్దలు అని తేడా లేకుండా, చలిని సైతం లెక్క చేయకుండా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అదే విధంగా ఆదివారం సెలవు కావడంతో బీచ్ రోడ్డు వెంబడి ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాలైన శ్రీ మోగదారమ్మ మహాలక్ష్మి ఆలయం, టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఇస్కాన్ టెంపుల్, హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో భక్తుల తాకిడి పెరిగింది.



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



రాజుల తాళ్లవలస షెల్టర్‌లో గోనె సంచులు ఉంచిన స్థానికులు



ఎస్సీ తాళ్లవలస వద్ద నిరుపయోగంగా బస్ షెల్టర్

తగరపువలస : జాతీయరహదారికి ఆనుకుని సర్వీస్‌రోడ్లపై నిర్మించిన బస్ షెల్టర్లు ప్రయాణికులకు అందనంత దూరంగా ఉన్నాయి. గ్రామాలు ఒకచోట ఉంటే బస్ షెల్టర్లు మరోచోట నిర్మించారు. దీంతో ఇవి నిరుపయోగంగా ఉంటున్నాయి. బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడకపోవడంతో వీటిని స్థానికులు గొడౌన్‌లుగా వినియోగించుకుంటున్నారు. చీకటి పడిన తరువాత అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తున్నాయి. బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో వెలమ మహానాడు

సింహాచలం: జీవీఎంసీలోని 98 వార్డుల్లోనూ వెలమ సామాజిక వర్గానికి చెందిన వారందరితో త్వరలో వెలమ మహానాడు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ తెలిపారు. పెందుర్తి దరి సుజాతగనర్ నుంచి అడవివరంలోని పాతగోశాల వరకు ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందినవారితో కొత్తగా సుజాతనగర్‌లో రంగరాయ వెలమ అసోసియేషన్ ఏర్పాటైంది. స్థానిక వెలమ సామాజిక వర్గ ప్రతినిధి వనం ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో పద్మావతినగర్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం సంఘం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ వెలమలంతా ఐక్యంగా ఉండి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అభిలషించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు



రుషికొండలో వైన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్

కొమ్మాది: వైన్‌షాప్‌ల వద్ద మద్యం కొనుగోలు చేసి అక్కడే సేవిస్తే చర్యలు కఠినంగా తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం సాధారణ తనిఖీలలో భాగంగా బీచ్ రోడ్డులో గల గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో గల వైన్ షాప్‌లను ఆయన తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా విక్రయించరాదని, నకిలీ మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదృశ్యమైన లారీ డ్రైవర్ విజయనగరంలో ప్రత్యక్షం

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ యడ్లవారి కళ్లాలకు చెందిన లారీ డ్రైవర్ తాడి వెంకటరావు ఆదివారం విజయనగరంలో ప్రత్యక్షమయ్యాడు. మానసిక స్థితి బాగా లేని వెంకటరావు ఈ నెల 3న ఇంటి నుంచి అదృశ్యమైన సంగతి తెలిసిందే. దీనిపై అతని భార్య కుమారి ఆనందపురం పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో భాగంగా అతనిని గుర్తించి ఆనందపురం తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆక్రమణల తొలగింపు



బొడ్డపాలెం ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డు పెట్టిన దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం సర్వే నంబర్ 292 ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను ఆదివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇక్కడి ప్రభుత్వ భూమిలో పంచాయతీకి అవసరమైన హెల్త్‌సెంటర్, కమ్యూనిటీహాలు, అంగన్వాడీ కేంద్రం తదితర భవనాలు నిర్మించాలని గతంలో పంచాయతీ వాసులు తీర్మానించారు. దీనికి భిన్నంగా కూటమి నాయకులు 15 వరకు షెడ్లు నిర్మించి ఆక్రమణకు పూనుకున్నారు. దీంతో బొడ్డపాలెం వాసులు ఆందోళనతో రెవెన్యూ అధికారులు స్పందించి జేసీబీ సాయంతో షెడ్లను నేలమట్టం చేసి హెచ్చరిక బోర్డు పెట్టారు. వీఆర్వో రామకృష్ణ సచివాలయ సిబ్బంది తదితరులు ఆక్రమణల తొలగింపు పనులు పర్యవేక్షించారు.

మంగళగిరికి తరలిన మాజీ సైనికులు



మంగళగిరిలో భీమిలికి చెందిన మాజీ సైనికులు

తగరపువలస: గంటూరు జిల్లా మంగళగిరి 6వ బెటాలియన్‌లో ఆదివారం మాజీ సైనికుల కోసం జరిగిన ఒకే రాష్ట్రం ఒకే అసోసియేషన్ సమావేశానికి భీమిలికి చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల మాజీ సైనికులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనికులు అంతా కలిసికట్టుగా ఉండి హక్కులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి నిర్ణయించారు. మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటుపై చర్చించారు. భీమిలి నుంచి మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి, చేట్ల సూరిబాబు, బి.కల్యాణ్, చిప్పాడ ఎస్ఎస్‌టీ నుంచి అధ్యక్షుడు సరగడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.